బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన శ్రీనివాస్

చిక్కడపల్లి,డిసెంబర్ 13: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గడ్డమీది శ్రీనివాస్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా గడ్డమీది శ్రీనివాస్ మాట్లాడుతూ.. పార్టీ మరింత పటిష్టతకు పని చేయాలని అధినేత సూచించారని తెలిపారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠా జయసింహ సూచనలకు అనుగుణంగా పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు.

దేవాలయ పునర్నిర్మాణ కమిటీ నియామకం

చిక్కడపల్లి,డిసెంబర్ 13: వివేక్ నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయం పునర్నిర్మాణ కమిటీ ఏర్పాటైంది. ఆలయానికి నూతన రెనోవేషన్ కమిటీని నియమిస్తూ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్ ఉత్తర్వులను జారీ చేశారు. మొత్తం 18 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన సమావేశంలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, దేవాలయం కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాథం సమక్షంలో కమిటీ చైర్మన్‌గా జానకీ సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. కార్యక్రమంలో సమావేశంలో సభ్యులు జి.పద్మవతి, నిర్మల, ముక్క రామకృష్ణ, శ్యామ్ కుమార్, సరళా నీతారాణి, ఎం.లక్ష్మీనారాయణ, సుబ్బారావు, బాలకుమార్, నవీన్ ప్రసాద్, వెంకట శేషుకుమార్, హరీశ్, ప్రతాప్‌కుమార్, వెంకటరావులతోపాటు పలువురు నియమితులయ్యారు.

పీజీ డిప్లామా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్షలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లామా ఇన్ హెల్త్ కేర్ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. ఈ కోర్సుల మొదటి, రెండు, మూడు, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

లా కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ అకారులు తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 17వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 21వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు.

బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ అధికారులు తెలిపారు. ఈ కోర్సు వివిధ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు.

బీఈ పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగింపు

ఓయూ పరిధిలోని అన్ని బీఈ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువు పొడిగించినట్లు ఓయూ అధికారులు తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ), బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల మెయిన్, బ్యాక్‌లాగ్, సప్లిమెంటరీ పరీక్షా ఫీజును ఈనెల 19వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

ఆరోగ్యం ప్రాథమిక హక్కు

అమీర్‌పేట్, డిసెంబర్ 13: ఆరోగ్యం ప్రతిఒక్కరి ప్రాథమిక హక్కని పంజాగుట్ట ఏసీపీ హరిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం బేగంపేట్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో జరిగిన మెడికవర్డ్ కార్డు ఆవిష్కరణలో సెంటర్ హెడ్ అభిలాష్ ముసునూరి, డాక్టర్ పి.ప్రదీప్‌రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక స్థోమత గురించి చింతించకుండా కుటుంబ సంరక్షణకు, ఆరోగ్యమైన సమాజాన్ని నిర్మించే దిశగా ఈ ఫ్యామిలీ కార్డు ఒక ముందడుగు వంటిదన్నారు.

తుకారాంగేట్‌లో ఆపరేషన్ రోప్

పుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అడ్డగుట్ట, డిసెంబర్ 13: చిలకలగూడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం ఆపరేషన్ రోప్ స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో తుకారాంగేట్ న్యూ బ్రిడ్జి నుంచి శాంతినగర్ వరకు పోలీసులు డ్రైవ్‌లో భాగంగా పుట్‌పాత్ ఆక్రమణల తొలగించారు. పుట్‌పాత్‌ను ఆక్రమించిన చిల్లర వ్యాపారులు, తోపుడు బండ్లను ఖాళీ చేయించి, ఆక్రమణలన్నింటినీ తొలగించారు. పాదచారులు, ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తున్న వారికి జరిమానా విధించారు.

ఆపదలో ఉన్న కార్యకర్తలకు అండగా ఉంటాం

గాయపడ్డ బీఆర్ఎస్ నాయకుడు వై.శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ యువనాయుడు ముఠా జైసింహ

చిక్కడపల్లి, డిసెంబర్13: ఆపదలో ఉన్న నాయకులు, కార్యకర్తలను అన్ని విధాలుగా అండగా ఉంటూ ఆదుకుంటామని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ అన్నారు. బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో త్రీవంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ముఠా జైసింహ శుక్రవారం వై.శ్రీనివాస్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన సహాయం అందిస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకులు మహ్మద్ అలీ, ప్రవీణ్, శ్రావణ్, కృష్ణ తదితరలు పాల్గొన్నారు.

నిరుద్యోగ విజయోత్సవ సభను అడ్డుకుంటాం

కొంపెల్లి నరేశ్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించ తలపెట్టిన విద్యార్థి, నిరుద్యోగ విజయోత్సవ సభను అడ్డుకుంటామని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొంపెల్లి నరేశ్ స్పష్టం చేశారు. విద్యారంగ సమస్యలను పట్టించుకోకుండా ఏ ముఖం పెట్టుకుని వర్సిటీలో సభ నిర్వహిస్తారని ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్రంలో విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినట్లుగా మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయలేదని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు పాత బకాయిలు చెల్లించలేదని విమర్శించారు. ఓయూలో మొత్తం 1250 మందికి గాను కేవలం 350 మంది పర్మినెంట్ అధ్యాపకులు ఉన్నారని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయలేదన్నారు.

రైల్వే కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

రైల్‌నిలయం లోని జీఎం కార్యాలయంలో ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్యకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్

మారేడ్‌పల్లి, డిసెంబర్ 13: రైల్వే కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దక్షిణ మధ్యరైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఎన్ఎఫ్ఐఆర్ జాతీయ ప్రధాన కార్యదర్శి, దక్షిణ మధ్యరైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య అన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికలు ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు జరుగగా.. ఈ ఎన్నిల్లో 43శాతం ఓట్లతో ఎంప్లాయీస్ సంఘ్ విజయం సాధించింది. కాగా, శుక్రవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలోని జీఎం కార్యాలయంలో సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్యకు రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ సర్టిఫికెట్‌ను అందజేశారు. అనంతరం మర్రి రాఘవయ్య మాట్లాడుతూ....భారత రైల్వేలోని 17 జోన్లలో 12 చోట్ల భారీ మెజార్టీతో విజయం సాధించడం జరిగిందని వెల్లడించారు. రైల్వే కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కరించడంతో ఎంప్లాయీస్ సంఘ్ ఎల్లప్పుడు కృషి చేస్తుందని తెలిపారు. రైల్వేలో 6 ఏండ్ల పాటు ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఉంటుందని జీఆర్ఎస్.రావు తెలిపారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పర్సనల్ ఆఫీసర్ జీ.ఆర్ఎస్.రావు, డిప్యూటీ సీపీఓ ఎం.బాలమురళీధర్, ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు ప్రభాకర్ ఆంధ్రూస్స్, ఎం. భరణి భాను ప్రసాద్, రాజగోపాల్, రుద్రారెడ్డి, షేక్ రావుఫ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

ప్రొఫెసర్ జి. నరేశ్‌రెడ్డి

సదస్సుకు హాజరైన అతిథులతో నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గడ్డం నరేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సమాజానికి అవసరమయ్యే పరిశోధనల అవసరం ప్రస్తుత కాలంలో ఎంతగానో ఉందని చెప్పారు. అసోసియేషన్ ఆఫ్ ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిసిస్ట్స్(ఏఈజీ) స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా 46వ వార్షిక సమ్మేళనం నిర్వహించారు. దీనిలో భాగంగా ఓయూ జియోఫిజిక్స్ విభాగంలో 'జియో ఎక్స్‌ప్లోరేషన్ ఫర్ క్రిటికల్ మినరల్స్ అండ్ ప్రీషియస్ మెటల్స్'పై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. జియోఫిజిక్స్ విభాగం, సెంటర్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ జియోఫిజిక్స్, ఏఈజీ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఏఈజీ ఉపాధ్యక్షుడు, జియోఫిజిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ వీరయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సదస్సుకు హాజరైన ప్రముఖ జియోఫిజిస్ట్‌లను ప్రత్యక్షంగా కలిసి వారితో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకునే అవకాశం దక్కుతుందని చెప్పారు. అంతేకాకుండా విద్యార్థులకు విద్య, పరిశోధన ప్రయత్నాలకు మార్గనిర్దేశం దొరుకుతుందన్నారు. ప్రొఫెసర్ వీరయ్య మాట్లాడుతూ.. సదస్సు లక్ష్యాలను వివరించారు. 1974లో ఏఈజీ ప్రారంభమైందని గుర్తు చేశారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, వాటి నుంచి బయటపడి, స్వర్ణోత్సవాలు జరుపుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా మూడు రోజుల వర్క్‌షాప్, రెండు రోజుల సమ్మేళనం, జాతీయ సదస్సు, ప్రదర్శన ఏర్పాటు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఓయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ గుండ ప్రభాకర్, షిజయ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో కృష్ణ కుమార్ గుప్త, ఏఈజీ సెక్రెటరీ డాక్టర్ బి. నరసింహారావు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి బాబు, కోశాధికారి జవహర్, సహాయ కార్యదర్శులు అల్లి పీర, డాక్టర్ ఎంఎన్ చారి, అధ్యాపకులు డాక్టర్ ఉదయలక్ష్మి, డాక్టర్ మంజుల, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ విద్యాసాగర చారి, డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ జోగు లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం

సభలో మాట్లాడుతున్న విశ్రాంత జడ్జీ చంద్రకుమార్

చిక్కడపల్లి, డిసెంబర్13: కార్మికుల శ్రమతో నిర్మించబడిన ప్రభుత్వ రంగం సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందని హైకోర్టు విశ్రాంత జడ్జీ చంద్రకుమార్ కేంద్ర కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. టీయూసీఐ 5వ జాతీయ మహాసభలు శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రకుమార్ మాట్లాడుతూ.. దేశపురోభివృద్ధిలో ప్రభుత్వ రంగం సంస్థల పాత్ర గణనీయంగా ఉందన్నారు. బహుహుజన లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ నల్లా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ.. రిజర్వేషన్లు కొనసాగాలంటే ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని కార్మిక సంఘాలకు పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ కేంద్ర కమిటీ సభ్యులు తుడుం అనిల్‌కుమార్, టీయూసీఐ కేంద్ర కమిటీ అధ్యక్షుడు ప్రేడ్జీ కెథాజత్, ప్రధాన కార్యదర్శి చార్లస్ జార్జీ, దొతి రాజేశ్‌ఖన్నా, ప్రసాద్‌బాబు, బసవలింగప్ప తదితరులు హాజరయ్యారు.

వర్క్‌షాప్

చిక్కడపల్లి,డిసెంబర్ 13 : బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన వర్క్ షాప్ శనివారం ముగిసింది. మెథడాలజీ అంశంపై జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ కె. శ్రీనివాస్ మాట్లాడారు. అదే విధంగా నారోటిక్స్ విభాగం పోలీసు అధికారులు సుబ్బారామి రెడ్డి, పి.శ్రీనివాస్‌రావులు డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపాల్, విద్యార్థులు, అధ్యాపకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పరిష్కరించాలి

అడ్డగుట్ట, డిసెంబర్ 13: డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. పెండింగ్‌లో ఉన్న పనులతో పాటు అసంపూర్తి పనులను త్వరగా పూరి చేసేల అధికారులపై ఒత్తడి తీసుకురావాలని ఈ సందర్భంగా ఆమె జెడ్సీని కోరారు.

లాడ్జీల్లో బస చేస్తూ.. రైళ్లలో చోరీలు

అంతర్రాష్ట్ర ఇద్దరు నిందితుల అరెస్టు.. వివరాలు వెల్లడించిన రైల్వే డీఎస్పీ జావెద్

కేసు వివరాలు వెల్లడిస్తున్న సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ ఎస్ఎన్.జావెద్

మారేడ్‌పల్లి, డిసెంబర్ 13:లాడ్జీల్లో మకాం వేస్తూ రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 4.3 తులాల బంగారు నగలు, రూ.19వేల నగదును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సీఐలు సాయిఈశ్వర్ గౌడ్, సరస్వత్‌లతో కలిసి సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ ఎస్ఎన్.జావెద్ వివరాలను వెల్లడించారు. బీహార్ రాష్ట్రం, ముంగేర్ జిల్లాకు చెందిన అన్నురాజ్ (31) టీ వ్యాపారం చేస్తున్నాడు. నిరజ్‌కుమార్ (18) కూరగాయల వ్యాపారం చేసుకుంటాడు. అదే గ్రామ వాసి అమర్జిత్‌కుమార్ వివిధ పనులకు వెళ్తుంటారు. అయితే వీరు మత్తు పదార్థాలకు అలవాటు పడ్డారు. దీంతో వీరికి వచ్చిన ఆదాయం సరిపోకపోవడంతో స్థానికంగా ఉండే గ్రామంలో చిన్న చిన్న దొంగతనాలు చేసేవాడు. ఇదే క్రమంలో జనరల్ టికెట్లు తీసుకొని రైళ్లలో తిరుగుతూ.. చోరీలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది ఆగస్టు 4వ తేదీన నిందితులు ముగ్గురు మోండా మార్కెట్ ప్రాంతంలో బాబా క్లాసిక్ లాడ్జీలో రూమ్‌లో ఉంటూ, పలు రైళ్లల్లో నలుగురు ప్రయాణికుల వద్ద నుంచి నగలు, నగదు ఉన్న బ్యాగులను దొంగించారు. బాధితుల వద్ద నుంచి పోలీసులకు ఫిర్యాదు రావడంతో కేసులు నమోదు చేసుకొని జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులు అన్నురాజ్, నిరాజ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లుగా నేరం అంగీకరించారు. నిందితుల వద్ద నుంచి రూ.3.41లక్షల విలువైన నగలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న అమర్జీత్‌కుమార్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న డీపీవో సుధీర్‌కుమార్ తదితరులు

మారేడ్‌పల్లి, డిసెంబర్ 13: సికింద్రాబాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రీడా మైదానంలో రైల్వేజూనియర్ కాలేజ్ లాలాగూడ 55వ క్రీడా వార్షికోత్సవాలు రెండు రోజులపాటు ఘనంగా జరిగాయి. శుక్రవారం క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్స్‌ల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా హైదరాబాద్ డివిజన్ సీనియర్ డీపీఓ జి.ఆర్.సుధీర్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతోపాటు క్రీడా రంగాల్లో రాణించాలన్నారు. ఈ కళాశాలలో విద్యనభ్యసించిన పలువురు విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని చదువుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో గెలుపోందిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సోమేందర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకట్ రమణ, పీటీఐ భరణి చంద్రిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిండ్రులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ గంగపుత్ర కాలనీ, నందు మటన్ షాపు, బాపూజీనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ ఎం సుప్రియా నవీన్ గౌడ్ శుక్రవారం జీహెచ్ఎంసీ కమిషర్ ఇలంబర్తిని కలిసి వినతి పత్రం మర్పించారు.

– *ముషీరాబాద్, డిసెంబర్ 13*

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే తలసాని, కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 13: పేద, మధ్య తరగతికి చెందిన కుటుంబాలలో ఆడబిడ్డ పెండ్లి ఆర్థిక భారంతో కూడుకున్నదని, కల్యాణలక్ష్మి పథకం ద్వారా లభించే ఆర్థిక సాయం కొంత వెసులుబాటుగా ఉంటుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని పద్మారావునగర్, భోలక్‌పూర్ ప్రాంతాలకు చెందిన 10 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, ఒకరికి షాదీముబారక్ చెక్కులను శుక్రవారం మారేడ్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన అందజేశారు. పేద ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత, బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, ముషీరాబాద్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు శివప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ అధ్యాపకుల వయోపరిమితిని పెంచండి: ఔటా

ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందజేసిన ఔటా ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పనిచేస్తున్న అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయసును పెంచాలని ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఔటా ప్రతినిధులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయసును పెంచినప్పటికీ, అధ్యాపకులను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వర్సిటీలలో సరిపడా బోధనా సిబ్బంది లేక పరిశోధనలు కుంటుపడుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగ విరమణ వయసును పెంచాలని కోరారు. దీనిపై కోదండరాం సానుకూలంగా స్పందించారని, ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఔటా నాయకులు ప్రొఫెసర్లు మనోహర్, కిషన్, శ్రీనునాయక్, గంగాధర్, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లు అర్జున్‌కు గాంధీలో వైద్య పరీక్షలు

గాంధీ దవాఖానలో అల్లు అర్జున్

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 13 : సినీనటుడు అల్లు అర్జున్‌కు శుక్రవారం మధ్యాహ్నం గాంధీ దవాఖానలో వైద్య పరీక్షలు నిర్వహించారు. చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి పర్యవేక్షణలో గాంధీ దవాఖాన మెయిన్ గేటు వద్ద, ప్రధాన ద్వారం వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అల్లు అర్జున్‌ను చూడటానికి దవాఖానలోని వైద్య విద్యార్థులు, సిబ్బంది, రోగి సహాయకులు పెద్దఎత్తున గుమిగూడారు. తన తండ్రి అల్లు అరవింద్‌తో కలిసి పోలీసుల వెంట ఆయన గాంధీ దవాఖానకు చేరుకున్నారు. పోలీసులు ముందుగా ఇచ్చిన సమాచారంతో అప్పటికే దవాఖాన ప్రధాన భవనంలోని సూపరింటెండెంట్ చాంబర్‌లో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, డిప్యూటి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్, ఆర్ఎంఓ శేషాద్రిల పర్యవేక్షణలో క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజు అల్లు అర్జున్‌కు పల్స్, బీపీ, షుగర్, ఈసీజీ, కోవిడ్ పరీక్షలను నిర్వహించారు. అనీన్ని నార్మల్‌గానే ఉన్నాయని ధ్రువీకరించి, పోలీసులకు రిపోర్ట్‌లను అందజేశారు. అనంతరం పోలీసు బందోబస్తు నడుమ ఆయనను నాంపల్లిలోని క్రిమినల్ కోర్టుకు తరలించారు.

యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలి

బైరు నాగరాజుగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని సంరక్షించాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బైరు నాగరాజుగౌడ్ డిమాండ్ చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలను వర్సిటీలే చేపట్టాలని అన్నారు. వర్సిటీలలో ఎన్నో ఏళ్లుగా అధ్యాపక భర్తీ చేయకపోవడంతో ఖాళీల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందన్నారు. ఇంకా జాప్యం చేస్తే వర్సిటీల్లో నాణ్యమైన ఉన్నత విద్య అందించే అవకాశం ఉండదని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కోర్సుల సిలబస్‌లో మార్పులు చేయాలని అధికారులు నిర్ణయించారని గుర్తు చేశారు. అందుకే తక్షణమే వర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడుతూ అధ్యాపక భర్తీని ఆయా యూనివర్సిటీలే చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాలనీ పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలి

బొల్లారం, డిసెంబర్